

మాట్లాడుతున్న బుర్ర శ్రీనివాస్

పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహిళలతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు ప్రేమపాఠం చెప్పానని తప్పుడు ఆరోపణలతో ఉపాధ్యాయురాలు కె. జ్యోతిర్మయి, వై. శేషలక్ష్మి 2021లో చిక్కడపల్లి పీఎస్‌లో పోక్సో చట్టం కింద కేసు పెట్టించి తనను జైలుకు పంపారని వాపోయారు. చట్టాన్ని దుర్వినియోగం చేసి అంగవైకల్యం ఉన్న తన లాంటి అమాయకులు బలికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తప్పుడు కేసులు పెట్టిన ఆ మహిళలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటం నర్సింహయాదవ్

తిరుమల లడ్డూ కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించండి

ముషీరాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి లడ్డూ కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ కులసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేయాలని, స్వచ్ఛమైన నెయ్యితో స్వామివారి ప్రసాదాన్ని తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు బిజ్జి కనకేష్ కుమార్, నగర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు పీఎన్ చారి, మాలతి, జ్యోతి, రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంఎం భాస్కర్‌రావు తదితరులు

బ్యాంకు పెన్షనర్స్‌కు నూతన హెల్త్ పాలసీ ప్రవేశపెట్టాలి

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పెన్షనర్స్ కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన హెల్త్ పాలసీ ప్రవేశపెట్టాలని ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఛైర్మన్ ఎంఎం భాస్కర్‌రావు కోరారు. ఆదివారం నల్లకుంటలో గల పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో అసోసియేషన్ సభ్యులు, కుటుంబసభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అసోసియేషన్ ఛైర్మన్ భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. కృష్ణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీ రమణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అనంతరాం, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అల్జీమర్స్ డే సందర్భంగా 50 మందికి ఉచితంగా పరీక్షలు



మాట్లాడుతున్న పి. లలిత

చిక్కడపల్లి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డిమెన్షియా/అల్జీమర్స్ దినోత్సవం సందర్భంగా హెరిటేజ్ ఎల్డర్ కేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో 50 ఏళ్ళ వయస్సు దాటిన వారికి ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. తెలంగాణ స్త్రీ సేవా సంస్థ పర్యవేక్షణలో డిమెన్షియా ఇండియా అలయన్స్, రెనోవా సెంచరీ ఆస్పత్రుల ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ డా. ఉదయ్‌కుమార్ 50 ఏళ్లు పైబడినవారికి జ్ఞాపకశక్తి పెంచుకునేందుకు కొన్ని సూత్రాలను వివరించారు. డిమెన్షియా రకాలు, అది రావడానికి కారణాలు, నిర్ధారణ, చికిత్స, ముందు జాగ్రత్తల గురించి డా. పిడపర్తి లలిత వివరించారు. ఈ సందర్భంగా 50 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు డా. గురజాడ శోభా పేరిందేవి, ఉపాధ్యక్షురాలు సంధ్య, కార్యదర్శి డి. హేమలత, కోశాధికారి శైలజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి

విద్యార్థులూ.. క్రీడలపై దృష్టిసారించండి

ముషీరాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి అన్నారు. ఆదివారం దోమలగూడలో 68వ ఎస్‌జీఎఫ్‌ఐ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్స్ లెవల్ టోర్నమెంట్, సెలక్షన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, ముషీరాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవి, డిప్యూటీ ఐవోఎస్ సుమన్, అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ జక్కయ్య, హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి : ఆర్య వైశ్యులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగంచాలని పలు వైశ్య సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టి ఆర్యవైశ్యుల మనోభావాలను రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. ఆదివారం కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ గుడికుంట్ల ధనుంజయ్, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి కూర రఘువీర్, వైశ్య హాస్టల్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి పబ్బటి రవిప్రసన్నకుమార్, కోశాధికారి పొద్దుటూరి రాజేశ్వర్‌రావు మాట్లాడారు.

ఎస్టీ వర్గీకరణ అంశం న్యాయమైందే

- ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ వర్గీకరణ కూడా చేయాలని ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమైందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ వర్గీకరణపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరగోపాల్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అదే తరహాలో ఎస్టీలను ఏ, బి, సి, డిలుగా వర్గీకరిస్తే సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికే పరిమితమైందని, ఎస్టీ వర్గీకరణ చేయాలని పెద్దఎత్తున ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మన భూమి, మన సంపద దక్కాలంటే పోరాటం చేయక తప్పదన్నారు. ఎస్టీ వర్గీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని సూచించారు. ఆదివాసీల భూములు లంబాడీల చేతుల్లోకి వెళ్లిపోయాయని, రిజర్వేషన్ ఫలాలు ఆదిమ తెగలకు దక్కడం లేదని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న భూములను బినామీ పేర్లతో కొంతమంది లాక్కుంటున్నారని పేర్కొన్నారు. ఆదిమ తెగలకు జరుగుతున్న అన్యాయాలను పరిగణనలోకి తీసుకుని ఎస్టీ వర్గీకరణ చేపట్టి అన్ని తెగలకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ అధ్యక్షుడు పట్నం ఉపేందర్, ఎస్టీ జేఏసీ ఛైర్మన్ పాయం సత్యనారాయణ, సలహాదారులు సాయం సత్యనారాయణ. శ్రీనాథ్, వివిధ సంఘాల నాయకులు లక్ష్మణ్, రత్నం, వెంకటేశ్వర్లు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళల పరిరక్షణలో శ్రీరామ్‌శ్రీపాద కృషి మరువలేనిది



భారతీయ నారీమణులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ సురేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ మనోహర్‌రావు తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, కళల పరిరక్షణలో శ్రీరామ్‌శ్రీపాద సాటే కృషి మరువలేనిదని ఆరోగ్య భారత జాతీయ కమిటీ సభ్యుడు డాక్టర్ బి. సురేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బర్కత్‌పురాలోని ఆర్‌ఎస్‌ఎస్ కేశవ నిలయంలో భారతీయ ఇతిహాస సంకలన సమితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా సేవలు అందించి మృతి చెందిన శ్రీరామ్ శ్రీపాద సాటే సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా ఉమ్మడి ఏపీలో తుపాన్ సమయంలో పేదల పునరావాసం కోసం సాటే ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి ఆర్‌ఎస్‌ఎస్‌కు తీరని లోటన్నారు. ఇతిహాస సంకలన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి మనోహర్ రావు మాట్లాడుతూ.. మహారాష్ట్ర నుంచి నగరానికి వచ్చిన శ్రీరామ్ శ్రీపాద తెలుగు నేర్చుకొని 20కి పైగా రచనలు చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ కె. సురేందర్ రచించిన భారతీయ నారీమణులు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య కేంద్ర ప్రముఖ్ కె. విద్యాసాగర్‌రెడ్డి, సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ వి కృష్ణారావు. ప్రధాన కార్యదర్శి ఎం. వీరేందర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య కళాసమితి వార్షికోత్సవం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్‌కు చెందిన అన్నమయ్య కళాసమితి 3వ వార్షికోత్సవాన్ని త్యాగరాయగానసభలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థలో శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసిస్తున్న విద్యార్థులు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. స్వరవీణాపాణి రచించిన 72 మేళకర్త రాగాల స్వర కామాక్షి, స్వర బీజాక్షరి కీర్తనలు 72 మంది 36 నిముషాల్లో ఆలపించగా తెలుగు బుక్ రికార్డ్‌లో రికార్డులో నమోదైంది. ఈ సందర్భంగా సంగీత గురువు గండేపల్లి సుమలతను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయరచయిత డా. సుద్దాల అశోక్‌తేజ, వంశీ సంస్థల అధినేత డా. వంశీ రామరాజు, సంగీత విద్వాంసులు గరికపటి ప్రభాకర్, నటులు డా. అక్కిరాజు సుందరరామకృష్ణ, ప్రముఖ మురళి విద్వాంసులు డా. రామచంద్రమూర్తి వైద్యుల, మాధవి వెల్లంకి తదితరులు పాల్గొన్నారు.



సుమలతను సన్మానించిన సుద్దాల అశోక్‌తేజ తదితరులు

క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ పేరుతో మోసం

- వాట్సాప్‌లో లింక్ పంపించి మొబైల్ హ్యాక్
- రూ.1.13 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ తీసుకుంటే అనేక లాభాలు ఉంటాయని సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని నమ్మించి మోసం చేశారు. నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. అతడికి 6296857591 నంబర్ నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాడు క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ గురించి వివరించాడు. ఇన్సూరెన్స్ తీసుకోవాలంటే క్రెడిట్ కార్డు వివరాలు కావాలని చెప్పాడు. బాధితుడి కార్డు వివరాలతోపాటు సీవీవీ నంబర్‌ను కూడా చెప్పాడు. క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ అప్లికేషన్ అంటూ వాట్సాప్‌లో లింక్ పంపించి మొబైల్‌ను హ్యాక్ చేశాడు. మొబైల్ హ్యాక్ అయిన తర్వాత వచ్చిన ఓటీపీలతో రెండుసార్లు క్రెడిట్ కార్డు నుంచి రూ.1,13,239 కాజేశాడు. విషయం తెలుసుకున్న బాధితుడు బ్యాంక్ అధికారులను సంప్రదించగా.. తాము ఎలాంటి లింక్‌లు పంపలేదని, ఇది సైబర్ నేరగాళ్ల పని అని చెప్పారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్సూరెన్స్, బ్యాంక్ అధికారులు కార్డు వివరాలు, సీవీవీ నంబర్ అడగరని పోలీస్ అధికారులు పేర్కొన్నారు.

ఆక్యుపంక్చర్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ఆక్యుపంక్చర్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సుధాకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీఏ సాగర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆక్యుపంక్చర్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆక్యుపంక్చర్ వైద్యుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పక్షవాతంతో పాటు చాలా రకాల రోగాలను ఆక్యుపంక్చర్ వైద్యం ద్వారా తగ్గించవచ్చని చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాకేష్‌జైస్వాల్, కోశాధికారి సుభాష్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రనగర్‌లో రోడ్లు అధ్వానం

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పవిత్రనగర్‌లో రోడ్లు దెబ్బతిన్నాయని, పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. రోడ్లను బాగు చేయించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ కె. రవిచారి, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్డు వేయడానికి రూ. 60 లక్షలు మంజూరు చేసి తర్వాత ఉపసంహరించుకున్నారని కాలనీ వాసులు చొక్కారపు రఘురాములుగుప్తా, శ్రీకాంత్ తెలిపారు. కాలనీలో రోడ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పవిత్రనగర్‌లో రోడ్డు దుస్థితి



వెనిశెట్టి సుధాకర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ఆలేరు షిరిడీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఆలేరు షిరిడీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని గుడి ఛైర్మన్‌గా ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి సుధాకర్ గుప్తా తెలిపారు. ఆయనను ఆదివారం రాంనగర్ పవిత్రానగర్‌లో గల ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, సభ్యులు నేత లక్ష్మణ్, సత్యవర్ధన్ కృష్ణమూర్తి, అనంతుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ బిల్డింగ్ ప్రారంభమెప్పుడో?

- జేఎన్‌టీయూలో రూ. 50 కోట్లతో నిర్మించిన గోల్డెన్ జూబ్లీ భవనం
- పనులు పూర్తయి.. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నిరుపయోగమే..



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి ఆర్ట్స్ కాలేజీ భవనం మాదిరిగా.. జేఎన్టీయూ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ బిల్డింగ్‌ను నిర్మించారు. యూనివర్సిటీ ఏర్పాటై 50 ఏళ్లు(గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిమిత్తం రూ. 50కోట్లతో గతేడాది అప్పటి వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి హయాంలో నిర్మాణ పనులు చేపట్టారు. తన పదవీ కాలంలో పూర్తయ్యే(మే21)లోగా భవనాన్ని ప్రారంభించాలనే నర్సింహారెడ్డి ఆశ ఎన్నికలకోడ్ ఫలితంగా నెరవేరలేదు. వాస్తవానికి ఈ భవనంలో ప్రతి అంగుళం స్పేస్‌ను ఏయే విభాగాలకు కేటాయించాలో, ఏయే అంతస్థుల్లో ఎటువంటి సదుపాయాలు సమకూర్చాలో పక్కాగా ప్లాన్ చేసిన ఆయన కలలు నెరవేరకుండానే పదవీకాలం ముగిసింది. అప్పటినుంచి ఈ భవనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రారంభిస్తారని విద్యార్థులు, ఆచార్యులు ఆశపడినా, రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జి వీసీ పట్టించుకోకపోవడంతో వారి ఆశలు నెరవేరలేదు.

భవనం ప్రణాళిక ఇదీ..

ఈ భవనంలోని ఒక్కో అంతస్థులో 17వేల చదరపు అడుగుల చొప్పున మొత్తం ఎనిమిది అంతస్థుల్లో కలిపి 1.36 లక్షల చదరపు అడుగుల స్పేస్ సిద్ధంగా ఉంది. ఐకానిక్ భవనాన్ని తొలుత.. ఇంటర్ డిసిప్లీనరీ అకడమిక్ రీసెర్చ్ అవసరాలకు వినియోగించాలని అధికారులు భావించారు. అయితే.. ఇందులోనే ఆదానీ కోనెక్స్ సంస్థ రూ. 5 కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు నాడు జేఎన్‌టీయూతో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒక అంతస్థును కేటాయించాలనుకున్నారు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సౌజన్యంతో బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సును జేఎన్‌టీయూ నిర్వహించాలని భావించింది. ఈ క్రమంలో మరొక అంతస్థును ఇస్రోకు కేటాయించాలని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అంగీకారానికి వచ్చారు. మిగిలిన ఆరు అంతస్థులను ఏ విధంగా వినియోగించాలనే అంశంపై వర్సిటీ ఉన్నతాధికారులు పెద్ద కసరత్తే చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆయా కోర్సుల నిర్వహణకు, లేబొరేటరీల ఏర్పాటుకు అవసరమైనన్ని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఆచార్యులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం ప్రారంభిస్తే విద్యార్థులకు మరిన్ని మౌలిక సదుపాయాలు సమకూరతాయని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ముగిసినా..

మే నెలలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో భవనం ప్రారంభోత్సవానికి ఎన్నికల సంఘం అనుమతించలేదు. జూలై 13న జేఎన్‌టీయూలో జరిగిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శిలాఫలకాలను కూడా సిద్ధం చేశారు. చివరి నిమిషంలో ప్రొటోకాల్ సమస్యలు ఉత్పన్నం కావడంతో భవనాన్ని ప్రారంభించకుండానే ముఖ్యమంత్రి వెనుదిరిగారు. దీంతో భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం.. ఆయనకున్న పలు అదనపు బాధ్యతల కారణంగా వర్సిటీ పాలనకు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారని, గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభానికి నోచుకోకపోవడానికి ఇది కూడా ఒక కారణమని విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. భవనాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జేఎన్‌టీయూకు రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.



కమాన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

రూ. 6 లక్షల వ్యయంతో దుర్గామాత కమాన్

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. రాంనగర్‌లోని కూరగాయాల మార్కెట్ చౌరస్తాలో నాగులు యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించే దుర్గామాత కమాన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. రూ. 6 లక్షల వ్యయంతో కమాన్‌ను నిర్మిస్తున్నామని నిర్మాణదారుడు నాగులు యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రామిరెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, కె సురేందర్, సయ్యద్ అస్లాం, గోపి, ఎయిర్‌టెల్ రాజు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయానికి దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో తండ్రి లేక సంరక్షకుడిని కోల్పోయిన విద్యార్థినీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. ఆదివారం ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతి నుంచి పిజీ వరకు చదువుతున్న తండ్రి లేక సంక్షరక్షకుడిని కోల్పోయిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు కాచిగూడ ట్రస్ట్ బోర్డులో దరఖాస్తులు పొందవచ్చని, అక్టోబర్ 10వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో అందజేయాలన్నారు. తండ్రి లేక సంరక్షకుడి మరణ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జతచేయాలని పేర్కొన్నారు. వివరాలకు 949161627404 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ట్రస్టీలు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్, ఆకుల నాగేష్, ఎలగందుల దేవేందర్, అమరం చంద్రశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ. 5 లక్షల విరాళం



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించింది. అసియేషన్ అధ్యక్షుడు కె. నర్సింగ్‌రావు, కార్యదర్శి పి. గోపాల్, కోశాధికారి కె. హుస్సేన్‌వల్లీ తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని ఆదివారం కలిసి చెక్కు అందజేశారు.

డీడీ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు



బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తెలిపారు. ఆదివారం డీడీ కాలనీలో పోలింగ్ బూత్ 15 పరిధిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గౌతమ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పి పోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

రాంనగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్‌కు చెందిన వైష్ణవి తొమ్మిదో తరగతి చదువుకుంది. ఈనెల 20 తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సుమారు రెండు కిలోమీటర్ల మేర సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి బాలిక సుల్తాన్‌బజార్‌లో స్నేహితురాలి వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఆమెను ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు. వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ప్రైవేట్ ఉద్యోగి మృతిచెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పుర సత్యానగర్‌లో నివసిస్తున్న మనీష్‌కుమార్ (24) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో ఇంటి సమీపంలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు బర్కత్‌పురలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మనీష్‌కుమార్ మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.